
అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు 6

6 పౌష్టికాహారంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచాలి

పల్లెపోరుకు సన్నద్ధం



- జిల్లాలో మొదలైన ఆశావహుల సందడి
- ఆగస్టు మొదటి వారంలో కొత్త ఓటరు జాబితా
- సెప్టెంబరు, అక్టోబరులో పంచాయతీ ఎన్నికలకు అవకాశం
- బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణ
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు అవకాశమా?
- 2019లో మూడు విడతల్లో ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లెల్లో ఎన్నికల చర్చలు మొదల య్యాయి. ఫిబ్రవరి 2వ తేదితోనే గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆగస్టు 1వ తేదీ నాటికి ఆరు నెలలు పూర్తవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంట్‌లు నిలిచిపోనుం డడంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సన్న ద్ధమైంది. దీంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గ్రామా ల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలోని ఆశావహుల్లో పంచా యతీ ఎన్నికలపై దృష్టి సారిం చారు. అగస్టు మాసంలో కొత్త ఓటరు జాబితా రానుంది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఎన్నికల నిర్వహించే విధంగా ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుం డగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివరాలు కూడా ప్రభుత్వం సేకరిస్తుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఫిబ్రవరి నెల కంటే ముందే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగా ఉండే విధంగా 200 మంది ఓటర్లతో ఉండే విధంగా బూత్ ఏర్పాటు చేసి ఒక ప్రీసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికా రులు, 400 నుంచి 650 మంది ఉండే పోలింగ్ బూత్‌ల్లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉండే విధంగా టీ పోల్ సాఫ్ట్‌వేర్‌లో వివరాలు కూడా నమోదు చేశారు. పంచాయతీ ఎ న్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు కూడా అందినట్లు తెలుస్తోంది.

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, 2,240 వార్డులు ఉన్నాయి. 2019లో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. ఇందులో 41 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ సారి కూడా మెజార్టీ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అవుతాయా అనే సందిగ్ధం కూడా ఉంది. గతంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొన్ని పంచాయతీలకు ఉపఎన్నికలు లేకుండానే కాలం గడిచిపోయింది. ఆరు సర్పంచ్ స్థానాలు, 82 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీకాగా ఎన్నికలు నిర్వహించలేదు. 2019లో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించిన ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు పట్టు వీడకపోవడంతో ఐదేళ్ల కాలం ఎన్నికలు లేకుండానే గడిచిపోయింది. ఈ సారి ప్రభుత్వం మారడంతో జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నువ్వానేనా అన్నట్లుగా మారాయి. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కూడా మహిళలకు ఉండడంతో అయా పార్టీల ఆశావహుల్లో ఆసక్తి పెరిగింది.

● రిజర్వేషన్లపైనే చర్చ..

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రధా నంగా రిజర్వేషన్ల చర్చనే కొనసాగుతోంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు పర్యాయాలు కొనసాగే విధంగా రిజర్వే షన్లు ఖరారు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీ రాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. బీసీ రిజర్వే షన్లు 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. దీనిపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహి స్తారా లేదా కొత్త రిజర్వేషన్లు తీసుకువస్తారా అనే అంశం తెరమీదకు వచ్చింది. బీసీ గణన అంశం కూడా ముందుకు వచ్చింది. ఈ పరిస్థితుల్లో బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

● నిధులు లేక కుంటుపడుతున్న అభివృద్ధి...

జిల్లాలోని గ్రామపంచాయతీల్లో నిధులులేక అభివృద్ధి కుంటు పడిందని, పాలక వర్గాలు లేక ప్రత్యేక అధికారుల పాలనలో పల్లె ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. తాజా మాజీ సర్పంచ్‌లు సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం ఎదరుచూస్తున్న వారు ఉన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపిన సందర్భాలూ ఉన్నాయి. కనీసం గతంలో 41 ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రావాల్సిన ప్రోత్సాహక నిధులు రూ 4.10 కోట్లు కూడా రాలేదు. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.

● ఆగస్టు 2న ఆపరేటర్లకు శిక్షణ..

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డుల మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు కోసం డేటా ఎంట్రీ ఆపరేట్లకు ఆగస్టు 2న హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లా నుంచి ఐదుగురు ఆపరేటర్లను ఎంపిక చేసి పంపిస్తున్నారు. శిక్షణ పొందిన ఆపరేటర్లు మండల స్థాయిలో మళ్లీ శిక్షణను అందించనున్నారు.

సిరిసిల్ల ఫైర్ అధికారిగా నరేందర్

- ఆరుగురు ఫైర్ మెన్‌ల నియామకం

సిరిసిల్ల క్రైం, జూలై 30: సిరిసిల్ల అగ్నిమాపక కేంద్రం ఫైర్ అధికారిగా ఎన్. నరేందర్‌ను నియమిస్తూ అగ్నిమాపకశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల అగ్నిమాపకశాఖ ఫైర్ మెన్‌లుగా జి. ప్రవీణ్ కుమార్(గూడెం), సాయికిరణ్ (రహీంఖాన్‌పేట), టి. శశీదర్(రుద్రంగి), ఎం. ప్రశాంత్‌కుమార్(అక్కపల్లి), డి. శివాజీ(బద్దనకల్), జె. శివకుమార్ (ఎల్లారెడ్డిపేట)లను నియమించారు. వీరందరు విధుల్లో చేరారు.

● సిరిసిల్ల ఇన్‌చార్జి ఫారెస్ట్‌రేంజ్ అధికారిగా కల్పన

సిరిసిల్ల అటవీశాఖ ఇంచార్జి ఫారెస్ట్‌రేంజ్ అధికారి(ఎఫ్ఆర్‌వో)గా స్ట్రైకింగ్ ఫోర్స్ ఎఫ్ఆర్‌వో కల్పనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సిరిసిల్ల ఎఫ్ఆర్‌వోగా ఉన్న ఆర్ శ్రీనివాసరావు ఖమ్మం స్ట్రైకింగ్ ఫోర్స్ ఎఫ్ఆర్‌వోగా బదిలీ అయ్యారు. పూర్తిస్థాయి ఎఫ్ఆర్‌వో వచ్చేవరకు ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వోగా కల్పన కొనసాగుతారు.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల బదిలీ

సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తొమ్మిది మంది ఉద్యోగులను బదిలీచేస్తూ ఇక్కడికి తొమ్మిదిమంది ఉద్యోగులను నియమిస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నలుగురు జూనియర్ అసిస్టెంట్‌లు, ఒక అటెండర్ బదిలీ కాగా వారి స్థానంలో జూనియర్ అసిస్టెంట్‌లుగా షేక్ జమీల్, ఉమ్మె సబా, అన్వేష్, మజార్, అటెండర్‌గా అనిల్‌ను నియమించారు. వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు అటెండర్లు బదిలీకాగా వీరి స్థానంలో అయిదుగురు ఉద్యోగులు బదిలీపై వచ్చారు. త్వరలో సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్‌లు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్‌గా ఇరుకుల్ల అశ్విన్



సిరిసిల్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాజన్న సిరిసిల్ల జిల్లా చైర్మన్‌గా ఇరుకు ల్ల అశ్విన్‌చంద్రతో పాటు కమిటీని నియమిస్తూ సోమవారం రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. అశ్విన్‌చంద్రతో పాటు వైస్ చైర్మన్లుగా కొండాపురం వెంకట్‌రెడ్డి, వంగల పర్శరాములు, కన్వీనర్‌గా భానుప్రకాష్, వేణుగోపాల్, జాయింట్ కన్వీనర్లుగా శేఖర్, శ్రీనివాస్, వివేక్, అధికార ప్రతినిధులుగా భగవాన్, కరుణాకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌కు అశ్విన్ ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 30: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పొరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించా రు. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను, విద్యార్థులకు కల్పి స్తున్న మౌలిక సదుపాయాల తీరును, కిచెన్, స్టోర్ రూమ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యా యులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో అన్ని వసతులు, సదుపాయా లు సక్రమంగా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నామని, మధ్యాహ్న భోజనం తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నామని అన్నారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేతన్నల సమస్యలపై అసెంబ్లీలో చర్చ

సిరిసిల్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వస్త్ర సంక్షోభంలో విలవిల్లాడుతున్న సిరిసిల్ల నేతన్నలపై సోమవారం రాత్రి అసెంబ్లీలో చర్చ జరిగింది. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అసెంబ్లీలో నేతన్నల సమస్యలపై మాట్లాడారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో మాట్లాడిన సందర్భంలో సమస్య పరిష్కారానికి సుముఖత వ్యక్తం చేసిన విషయాన్ని వెల్లడించారు. వాళ్లే కలిసి కూర్చోని మాట్లాడుదామని చెప్పడం జరిగిందని అన్నారు. మరోవైపు సిరిసిల్లలో కరెంట్ రాయితీ సమస్య, ప్రభుత్వ ఆర్డర్లు, ఇతర సమస్యలపై అందోళనలు కొనసాగుతున్నాయి.

మ్యాక్ సొసైటీ అధ్యక్షుడిగా భాస్కర్



గోవిందు భాస్కర్, విద్యాసాగర్

సిరిసిల్ల క్రైం, జూలై 30: రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయవా దుల పరస్పర సహకార పరపతి సంఘం (మ్యాక్) అధ్యక్షుడిగా గోవిందు భాస్కర్, ఉపాధ్యక్షుడిగా కే విద్యాసాగర్ రావు ఎన్నికయ్యా రు. మంగళవారం సిరిసిల్ల కోర్టు బార్ అసోసియేషన్ హాలులో మ్యాక్ సొసైటీ ఎన్నికలు జరిగా యి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గోవిందు భాస్కర్, అంజనేయులు, ఉపాధ్యక్షులుగా విద్యాసాగర్‌రావు, యాట శ్రీనివాస్ పోటీ చేశారు. ఇందులో గోవిందు భాస్కర్‌కు తొమ్మిది మంది డైరెక్టర్లు ఓట్లు వేయగా, అంజనేయులుకు ముగ్గురు డైరెక్టర్లు ఓట్లు వేశారు.

దీంతో అధ్యక్షుడిగా గోవిందు భాస్కర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్‌రావుకు పది మంది డైరెక్టర్లు ఓట్లు వేయగా యాట శ్రీనివాస్‌కు ఇద్దరు డైరెక్టర్లు ఓటు వేయడంతో విద్యాసాగర్‌రావు గెలుపొందారు. గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, డైరెక్టర్లకు ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారి ఐల్నేని కిషోర్‌రావు అందజేశారు. విజేతలను సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి, గుడిసె సదానందం, కార్యదర్శులు వెంకటి, రజనీకాంత్‌లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపి సత్కరించారు.

నేడు ఇసుక డంప్ వేలంపాట

ఇల్లంతకుంట, జూలై 30: మండలంలోని పొత్తూర్ గ్రామంలో అక్రమంగా నిలువచేసిన ఇసుక డంప్‌కు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫారూక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తికలిగిన వారు రూ వెయ్యి దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన ర్యాలీ

వేములవాడ టౌన్, జూలై 30: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటన్నే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వేములవాడ పట్టణంలోని ఏఐటీయూసి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడు తూ 22 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం నిర్వహిస్తు న్న కార్మికుల జీవితాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని వాపోయారు. సరిపడా జీతాలు లేకపోవడం తో పూట గడవని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి తరలి వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడారి రాములు, కార్మికులు తదిరులు ఉన్నారు.

11,915 మంది రైతులు.. రూ. 116 కోట్లు

- రైతులకు రెండో విడత రుణమాఫీ నిధులు విడుదల
- చెక్కును ఆవిష్కరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రుణమాఫీకి సంబంధించి రెండో విడత రూ 1.50 లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండోవిడత రుణమాఫీ నిధుల విడుదలకు సంబంధించిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా అధికారులు, రైతులు, సింగిల్ విండో చైర్మన్లు పాల్గొన్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించి రెండో విడత 11,915 మంది రైతులకు సంబంధించి 116 కోట్ల రూపాయల రుణమాఫీ చెక్కును అందించారు. మొదటి విడతలో 23,785 మంది రైతులు అర్హులుగా రూ 167.48 కోట్లు రుణమాఫీ నిధులు విడుదల అయ్యాయి. ఇందులో 23,330 మంది రైతుల ఖాతాల్లో రూ 127.22 కోట్లు జమ అయ్యాయి. రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో లక్ష రూపాయల వరకు 23,785 మంది రైతుల ఖాతాల్లో రూ 167.48 కోట్లు ప్రభుత్వ జమ చేసిందని రెండో విడతలో రూ 1.50 లక్షల వరకు రుణమాఫీ నిధులను విడుదల చేసిందన్నారు. సిరిసిల్ల జిల్లాలో 11,915 మంది రైతులకు 116 కోట్ల రూపాయలు మాఫీ కానున్నట్లు తెలిపారు. రెండో విడతలో రైతు రుణమాఫీ జరిగిన లబ్ధిదారులు బ్యాంక్ రుణాలను రెన్యూవల్ చేసుకోని రుణమాఫీ సొమ్మును వారి సేవింగ్ ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. దీని కోసం బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఎల్‌డీఎం మల్లికార్జున్, సహకార అధికారి బుద్ధనాయుడు, సింగిల్ విండో చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పోలీస్ వాహనాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై 30: పోలీస్ వాహనాల నిర్వహణ బాధ్యతాయుతంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ వాహనాల డ్రైవర్లకు విధినిర్వహణలో పాటించాల్సిన అంశాలపై మంగళవారం ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసులు సంఘటనా స్థలాలకు త్వరగా వెళ్లే క్రమంలో డ్రైవర్‌ల బాధ్యత ప్రధానమన్నారు. ప్రతి ఒక్కరు కంటిచూపు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇందులో భాగంగానే ప్రతీ డ్రైవర్‌కు కంటి పరీక్షలు చేయిస్తు న్నామన్నారు. ప్రతీఒక్కరు నిబంధనలు పాటిస్తూ అందరికి ఆదర్శంగా ఉండాల న్నారు. అదే సమయంలో పోలీస్‌వాహనాన్ని చూస్తేనే పోలీస్‌శాఖ గౌరవం, ప్రతిష్టను పెంచే విధంగా వాహనాల నిర్వహణ ఉండాలన్నారు. పోలీస్ ఉద్యోగం అత్యవసర సేవల్లో డ్రైవర్‌లంతా అధికారులు సూచిం చిన విధంగా సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లో ముందుండాలన్నారు. డ్రైవర్‌లంతా వాహనాల్లో ఇంజన్ ఆయిల్ మొదలుకొని, స్పేర్ పార్టులు, వాహనాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించడం లాంటి విషయాలలో జాగ్రత్తలు పాటిస్తూ వాహనాన్ని సొంత వాహనంగా చూసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా ఉన్న వాహనాలను కండిషన్‌లో ఉంచుతూ, నిర్వహణ సక్రమంగా ఉన్న వాహనాలను గుర్తింపు సంబంధిత డ్రైవర్‌లకు ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఇందులో భాగంగా అన్ని పోలీస్‌స్టేషన్‌ల వాహనాల డ్రైవర్‌లకు ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వారితో కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మధుకర్, యాదగిరి, ఆర్ఎస్ఐ రాజు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

7న పాతవాహనాల వేలం

సిరిసిల్ల క్రైం, జూలై 30: జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో ఉన్న పాత వాహనాల సామగ్రిని ఆగస్టు 7న వేలం వేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇందులో టైర్లు, బ్యాటరీలు, ఇంజన్‌ఆయిల్, తదితర సామగ్రిని ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని ఆయన తెలిపా రు. వేలం పాటలో పాల్గొనే కొనుగోలుదారులు ఆధార్‌కా ర్డు, ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు తీసుకొని హాజరుకా వాలని ఆయన తెలిపారు. ఇతర వివరాల కోసం ఆర్ఐని 8712656428నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోనరావుపేట జూలై 30: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి సత్తయ్య అనే వ్యవసాయ కూలీ సోమవారం మృతి చెందగా ఆ కుటుంబానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు తాళ్లపల్లి సత్తయ్య మృతి చెందిన వార్త వినగానే కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ చేతుల మీదు గా అందజేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, గొట్టే రామచంద్రం, బీజేపీ జిల్లా, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

దుబాయ్‌లో సిరిసిల్ల వాసి అదృశ్యం

- ప్రభుత్వ విప్ చొరవతో నేడు ఇంటికి

సిరిసిల్ల క్రైం, జూలై 30: దుబాయ్‌లో అదృశ్యమై.. నిస్సహాయ స్థితిలో ఉన్న సిరిసిల్లకు చెందిన యువకు డు ప్రభుత్వ విప్ చొరవతో తిరిగి బుధవారం స్వగ్రామానికి చేరుకోనున్నాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన అకెన రవి (36), మరో స్నేహితుడైన శ్రీనివాస్ కలిసి విజిట్ వీసాపై ఈనెల 17న దుబాయ్ వెళ్లారు. దుబాయ్ వెళ్లిన తర్వాత ఇద్దరు కలిసి రూంకు వెళ్లాల్సి ఉండేది. అయితే దుబాయ్ వెళ్లిన రోజుననే రవి అతని స్నేహితుడికి కనిపించకుండా పోయాడు. దీంతో స్నేహి తుడు శ్రీనివాస్ దుబాయ్‌లో అతని ఆచూకి ప్రయత్నిం చినా ఫలితం లేకపోవడంతో తిరిగి దుబాయ్ నుంచి సిరిసిల్లకు వచ్చేశాడు. దుబాయ్‌లో రవి మిస్సింగ్ అయినట్లు కుటుంబసభ్యులకు తెలిపాడు. అప్పటికే రవి అదృశ్యమైనట్లు అయినట్లు దుబాయ్‌లో కేసు నమోదైంది. రవి దుబాయ్‌లో అదృశ్యమైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి కుటుంబసభ్యులు తీసుకెళ్ల డంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈనెల 29న దుబాయ్ లోని ఇండియన్ ఎంబసీకి లేఖ రాయించి విచారణకు ఆదేశించారు. దీంతో ఎంబసీ అధికారులు స్పందించి విచారణ చేపట్టడంతో అక్కడి పోలీసులు 24 గంటల్లోనే షార్జాలో రవి ఉన్నట్లు గుర్తించారు. షార్జా ప్రాంతంలో ఉన్న రవి ఆచూకీ తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి అతన్ని చేరదీశారు. నడువలేని స్థితిలో ఉన్న రవిని ఇండియన్ ఎంబసీలో సురక్షితంగా ఉంచి కుటుంబస భ్యులకు సమాచారం అందించారు. ఆ తర్వాత దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు, సామాజిక సేవకుడు గుండెల్లి నర్సింహులు ద్వారా రవిని షార్జానుంచి దుబాయ్‌కి తరలించారు. మంగళ వారం రాత్రి రవిని క్షేమంగా దుబాయ్ ఏయిర్‌పోర్ట్‌కు నర్సింహులు తీసుకెళ్లి హైద్రాబాద్ ఫ్లయిట్ ఎక్కించారు. బుధవారం ఉదయం హైద్రాబాద్ విమానాశ్రయానికి రవి చేరుకుంటారు. తన భర్తను క్షేమంగా ఇంటికి రప్పించడానికి కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సామాజిక సేవకుడు నర్సింహులుకు అకెన రవి భార్య రూప కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 30: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణం బతుక మ్మ ఘాట్ వద్ద నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లాలోని వివిధ మండ లాల నుంచి క్రీడాకారులు అండ ర్- 14, 16, 18, 20 వయస్సు విభాగాల్లో బాల బాలికలు, యువతీ యు వకులు పాల్గొన్నారు. అథ్లె టిక్స్‌లోని వివిధ పోటీ ల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి కి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్లను జిల్లా అథ్లెటి క్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ అందించి అభినందిం చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కనకం శ్రీనివాస్, సభ్యుడు నేరెళ్ల గంగధార్, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, శ్రవణ్‌కు మార్, దేవరాజు, బొజ్జ రాజు తదితరులు పాల్గొన్నారు.



మెడల్స్, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

మద్యం దుకాణాల్లో చోరీ

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మంగళవారం దొంగతనాలు జరిగాయి. ఉదయం మద్యం షాపులను తెరువడంతో దొంగలు పడ్డట్టు గుర్తించారు. వెంటనే షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌లోని ఓ వైన్ షాపులో గాలికోసం ఉన్న చిన్న కిటికీని ఊడదీసి లోపలకు దొంగలు దూరారని పెద్దగా మద్యం చోరీ కాలేదని, నగదు డబ్బుల కోసం కౌంటర్లు చెక్ చేశారని కానీ వారికి ఏమీ నగదు దొరకలేదని యజమాని సంతోష్‌రావు తెలిపారు. అలాగే అక్కడే సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సైతం దొంగలు పైకప్పు రేకులు తీసి లోనికి వచ్చారని కౌంటర్‌లో ఉన్న చిల్లర దాదాపు రెండు వేల వరకు తీసుకు వెళ్లారని నిర్వాహకులు నరేష్ తెలిపారు.

సుభాష్‌నగర్‌లో బైక్ చోరీ

సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఎవరూ లేని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో దూరిన దొంగ ఇరవై వేల నగదు చోరీ చేశాడని దాంతో పాటు ఇంటి ఆవరణలో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని సైతం ఎత్తుకెళ్లాడని బాధితుడు ఆరేపల్లి బాలరాజు తెలిపారు. తాము ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి ఈ దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ చోరీ మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయి ఉంది.

జ్వరంతో బాలుడి మృతి

సుల్తానాబాద్, జూలై 30: మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఓ బాలుడు మంగళవారం మృతిచెందాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్‌కు చెందిన సాదిక్-రెహానా దంపతుల పదకొండు నెలల కుమారుడు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజులు పట్టణంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగి ఫిట్స్ వచ్చాయి. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు బాలుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

కోల్‌సిటీ, జూలై 30: మద్యం సేవించి వాహనం నడిపి రెండవసారి పోలీసులకు పట్టుబడిన కేసులో బామిని భరత్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 11మందికి రూ.2000చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగాధర, జూలై 30: గంగాధర మండలం మధురానగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని డీటీసీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు పట్టుకున్నారు. గంగాధర డీటీసీఎస్ ఉష మాట్లాడుతూ మధురానగర్ గ్రామ పరిధిలోని పత్తికుంటపల్లిలోని మామిడితోటలోని ఓ ఇంట్లో అక్రమంగా 40 క్వింటాళ్ల రేసన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందింది. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంటు అధికా రులు, డీటీసీఎస్ బృందం తనిఖీ చేయగా సంచుల్లో నింపిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. ఇంటిపక్కన ఉన్న కడమంచి రమేష్ మోటర్ సైకిళ్లమీద ఊళ్లలో సేకరించిన రేషన్ బియ్యా న్ని జగిత్యాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు


గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు కొనసాగుతున్నది. మంగళవారం ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టినా కూడా ఎత్తిపోతలను అధికారులు కొనసాగిస్తున్నారు. సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 11,173 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,568 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతం నుంచి 7,605 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. మిడ్ మానేరుకు 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్ ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.371 టీఎంసీలు ఉన్నాయి.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న పంపింగ్

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నాలుగో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం 4 బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు మంగళవారం కూడా నీటి విడుదల యథావిధిగా కొనసాగించారు. ఐదు పంపుల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోకి తరలి వెళ్తుంది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని ఐదు పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం పెరిగింది. గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతుంది. ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది.

మిడ్ మానేరులో 9టీఎంసీల నీరు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు 308.46 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 9.19 టీఎంసీలు ఉన్నది.

ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 35.297 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 30.058 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రుణమాఫీ కార్యక్రమంలో అల్గునూర్ రైతు


హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎంతో రైతు జాప లక్ష్మారెడ్డి

తిమ్మాపూర్, జూలై30: రైతు రుణామాఫీలో కార్యక్రమంలో భాగంగా 1లక్ష 50వేల వరకు రైతులకు రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం హైదారాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంచనంగా ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులతో పాటు జాప లక్ష్మారెడ్డి పాల్గొని రైతు కుంటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి అందజేసిన చెక్కును అందుకున్నాడు. తనకు 1లక్ష 22వేల 979రూపాయల రుణమాఫీ అయిందని తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వారిపై కేసు

గంగాధర, జూలై30: గంగాధర మండలం కొండన్నపల్లిలో అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వ్యక్తితో పాటు అప్పటి కార్యదర్శిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండన్నపల్లికి చెందిన కడార్ల ఆగయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్య గతకొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆగయ్యకు వెంకటాచారి, సత్యనారాణ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్యకు గ్రామంలో వారసత్వంగా ఉన్న ఇంటిని ఇద్దరి అన్నదమ్ములకు చెందవలసి ఉండగా సత్యనారాయణ పేరుపై 2018లో అప్పటి కార్యదర్శి మార్పిడి చేశాడు. వెంకటచారి ఫిర్యాదు మేరకు సత్యనారాయణ, అప్పట్లో గ్రామంలో పనిచేసిన కార్యదర్శిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి


గాయపడిన వైద్యుడు

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మహేందర్ విధులు ముగించుకొని పెద్దపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో డాక్టర్ మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహించి సాయంత్రం తన కారులో పెద్దపెల్లికి వెళుతుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి పారిపోయినట్లు సమాచారం.

కుక్కను తప్పించబోయి యువకుడికి తీవ్ర గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామంలో ఓ యువకుడు కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వీణవంక మండలం లస్మక్కపేట గ్రామానికి చెందిన దాసారపు సతీష్ గోవిందాపూర్ గ్రామంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడ్డాడు. తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108వాహనంలో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో కోతుల బెడద

● దాడుల్లో పలువురికి గాయాలు ● కలెక్టర్‌కు వినతి


గాయపడిన వృద్ధురాలు

కరీంనగర్ రూరల్, జూలై30: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎలబోతారం గ్రామంలో సమీపంలో గుట్ట ఉండటంతో కోతుల సంచారం పెరిగింది. అయితే మంగళవారం గ్రామంలోకి ప్రవేశించిన కోతులు పలువురిని గాయపరచగా వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన ఆడెపు మల్లమ్మ, వాసల శేషమ్మ, తుమ్మణవేని లక్ష్మీ, దుబ్బెట భూమక్కలపై దాడి చేశాయి. కోతి కరవడంతో గాయపడిన వాళ్లు కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే గత వారం రోజుల కిందట కూడా పత్తెం శ్రీనివాస్ కూతురు అనన్యపై దాడి చేయగా చిన్నారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోతుల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని, మహిళలు చిన్నారులపై దాడి చేస్తున్న కోతులను పట్టుకునేందుకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

9నుంచి ఎస్‌యూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, జూలై 30: ఎస్‌యూ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 9నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

● ఎంబీఏ, ఎంసీఏ, పరీక్షలు ఆగస్టు 9 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రాణాధికారి తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు.

అటవీభూమిలో సాగును అడ్డుకున్న అధికారులు


గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

వీర్నపల్లి, జూలై 30: వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామ పరిధిలోని రాశిగుట్ట తండాలో అటవీ భూమిలో గిరిజనులు పత్తి సాగు చేస్తుండగా అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు గిరిజనులకు మధ్య తోపులాట జరుగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాశిగుట్ట తండాలో గత ఐదేళ్లుగా అటవీ భూమిని చదును చేసి పత్తిపంట సాగు చేసుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. అదే భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కల ప్లాంటేషన్ పనులు చేపట్టడంతో గిరిజనులు మొక్కలను తొలగించారు. ఈ భూములను కొన్ని ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామని గిరిజనులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గిరిజనులు, అధికారులు ఒకరినొకరు తోసేసుకున్నారు. దీంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, వీర్నపల్లి అటవీ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్ తన సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఉద్రిక్తత మధ్య అధికారులు అక్కడి నుంచి వెను దిరిగి వెళ్లిపోయారు. చదును చేసిన అటవీ భూమిలో మొక్కలను ప్లానిటేషన్ చేస్తామన్నారు.

మరమగ్గాల కార్మికులకు పని కల్పించాలి

● గంగాధర ప్రధాన రహదారిపై కార్మికుల ధర్నా


గంగాధర ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మగ్గాల కార్మికులు

గంగాధర, జూలై30: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని గంగాధర మండలం కురిక్యాల ప్రధాన రహదారిపై గర్షకుర్తి, ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల మగ్గాల కార్మికులు,సంఘ నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా మగ్గాలు నడవక పోషణ భారమవుతుందన్నారు. గర్షకుర్తి మగ్గాలకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు, గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల కోట్ల బకాలు నిలిచి పోయాయని ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గర్షకుర్తిలో గత ఆరు రోజులుగా ధర్నాలు చేస్తున్న కనీసం ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. మగ్గాల కార్మికులకు తక్షణం పని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కురిక్యాల రహదారిపై కార్మికుల ధర్నాతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి, ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసనకారులను శాంతింపజేసి ధర్నాను విరమింపజేశారు. కార్మికులకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లను నెరవేర్చి చేతినిండా పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మగ్గాల కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థి

రామడుగు, జూలై 30: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి దీపక్ అండర్-14 క్రికెట్ టీం తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయిలో ఆడి సత్తా చాటాడు. దీంతో పాటు నేపాల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా రాణించాడు. ఈ మేరకు ఆటల్లో రాణించిన విద్యార్థిని మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి సురేందర్ రెడ్డి, నేచర్ యూత్ క్లబ్ అంబేద్కర్ యువజన సంఘం తరపున శాలువాతో ఘనంగా సత్కారించారు.ఈ కార్యక్రమంలో నేచర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసారపు పరశురాం, బుర్ర శ్రీకాంత్, రేణిగుంట అశోక్ పాల్గొన్నారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఒక రైతు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చాడు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'తో ఊపు

● ఉమ్మడి జిల్లాలో రూ.230.72 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జూలై 30: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆదాయం 230.72 కోట్ల రూపాయలు సమకూరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. ఆర్టీసీలో ప్రయాణించిన మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు డబ్బులు చెల్లించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రకటించిన 2023 డిసెంబర్ 9 నుంచి మంగళవారం వరకు మహాలక్ష్మి పథకం కింద 6.35 కోట్ల మంది ప్రయాణించారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖని, మంథని, హుజూరాబాద్ హుస్నాబాద్ డిపోలు ఉండగా వాటిలో రీజియన్ ఆదాయంలో మొత్తంలో మహాలక్ష్మి ఆదాయం 49.22 శాతంగా ఉండడం విశేషం. మహాలక్ష్మి పథకం అమలు కంటే ముందు 68.13 శాతం ఆక్యుపెన్సీ రేషియా ఉండగా, మహాలక్ష్మి పథకం అమలు తర్వాత 85.33 శాతానికి పెరిగింది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య 4.15లక్షలకు పెరగడంతో తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రీజియన్ వ్యాప్తంగా భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

-రీజనల్ మేనేజర్ సుచరిత



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల్లో ఆర్టీసీ బస్సులను రద్దీకి అనుగుణంగా నడిపిస్తున్నాం. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత రద్దీని బట్టి అన్ని డిపోల్లో బస్సుల సంఖ్య పెంచాం.ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సంస్థ ఉద్యోగులంతా కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తాం.

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడిపై 17 కేసులు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, జూలై 30: పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్‌ను అరెస్ట్ చేసినట్టు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రూ. వేయి నగదు, దొంగతనాలను వినియోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యుగేందర్‌పై 17 కేసులున్నాయని వివరించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు.. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్ కూలీ పనులు చేయడంతో పాటు వ్యాన్‌లో క్లీనర్‌గా కొనసాగేవాడు. మద్యం, జల్సాలకు అలవాటు పడిన అతడు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు దిగాడు. 2010 నుంచి 2018 వరకు కరీంనగర్ పట్టణంలో పలు దొంగతనాలను పాల్పడి పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన యుగేందర్ ఈ నెల 26న ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని రాచర్లబొప్పాపూర్, గోరంట్యాల గ్రామంలోని పెద్దమ్మ, ఎల్లమ్మ, సాయిబాబా ఆలయాల్లో చోరీకి పాల్పడ్డాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఈ నెల 30న నిందితుడు దొంగతనం చేయడం కోసం కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్నాడనే సమాచారంతో స్థానిక బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.వేయి నగదుతో పాటు చోరీకి వినియోగించే ఇనుప రాడ్‌ను స్వాధీనపర్చుకున్నారు. విచారించగా పలు ఆలయాల్లో దొంగతనాలను పాల్పడ్డానని అంగీకరించాడు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, క్లూస్ టీం ఏఎస్ఐ శరత్, సిబ్బంది బాబయ్య, రాజేందర్, శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు.

డిప్లొమా కోర్సుల కోసం డైట్‌లో ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, జూలై30: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఎల్ఇడి), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డిఇఎస్ఈ) మొదటి సంవత్సరంలో 2024-25 చేరేందుకు నిర్వహించిన డిఈఈసెట్-2024 ఫలితాలు వెల్లడైనట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు సంబందిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన పాత కరీంనగర్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్ విధానంలో ఆగస్టు 1,2వ తేదీలు రెండు రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్), కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, ఎల్ఎండీ కాలనీలో జరగనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ డీఈఈసెట్-2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, ఇంటర్ వరకు స్టడీ, కుల, ఆదాయ(2024) ధ్రువపత్రాలతో పాటు ఇతర ప్రత్యేక పత్రాలు(పిహెచ్‌సి, ఎన్‌సిసి, సిఏసి ఉంటే) ఒరిజినల్స్ వెంట తీసుకుని రావాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

సిరిసిల్ల రూరల్, జూలై 30: సిరిసిల్ల వస్త్ర పరిశ్రల సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం నివారించడంతోపాటు ఉపాధిని కల్పించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్రపరిశ్రమల అనుబంధ సంఘాల జేఏసీ అధ్వర్యంలో చేప ట్టిన రిలేనిరహార దీక్షలు మంగళవారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో యారన్ అసోషియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, మ్యాన సత్యానారాయణ, భారత్‌శ్రీనివాస్, ఎర్రగుంట మహేష్, గోవిందు మహేష్, గాజుల లింగం, ఎనగంటి రాజమల్లు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభాన్ని పరిష్కారించాలని, కరెంట్ సబ్సిడీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసాములు, కార్మికులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల టౌన్, జూలై 30 : సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయంలో 20వ వార్డుకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు మంగళవారం వార్డ్ కౌన్సిలర్ చొప్పదండి లలిత చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, 20వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రావణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని పారిశుధ్య సిబ్బంది ఆందోళన

ముస్తాబాద్, జూలై 30: వేతనాలు పెంచాలని ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ పారిశధ్య సిబ్బంది ఆందోళన చేశారు. చాలీ చాలని జీతాలతో దుర్భర జీవితాల్ని అనభవిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ హదరాబాద్‌కు వెళుతన్న క్రమంలో పోలీసులుఅరెస్టు చేసి ఠాణాకు తరలించారు. తమకు న్యాయం చేసి వెట్టి చాకిరీ చేసి తమకు వేతనాలు పెంచాలని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


నియామక పత్రం అందుకుంటున్న ఆది శ్రీనివాస్

పంజాగుట్ట, జూలై30 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పటేల్ అన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిజాం క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఇందులో వివిధ అంశాలను చర్చించారు. అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సభ్యులు వీరమళ్ల ప్రకాష్, పూల రవీందర్, రౌతు కనకయ్య, సీ విఠల్, మీసాల చంద్రయ్య, ఆకుల రజిత అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరుకాపులతో పాటు బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజల సంక్షేమం, ఉన్నతికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా చేయూతను అందిస్తానన్నారు. అపెక్స్ కౌన్సిల్ అధ్వర్యంలో ఆగస్టు10న కేంద్ర మాజీ మంత్రి పి శివశంకర్ పటేల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మంగారపు లక్ష్మణ్, ఆది విష్ణుమూర్తి, ఎస్ మల్లేష్, ఎర్రా నాగేందర్, ఊసా రఘు, అనిల్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఏ రామారావు, పీఎల్ఎన్ పటేల్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన రిటైర్డ్ ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, జూలై 30 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలు, రూ. 398 రూపాయల వేతనంతో చేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలని జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు వి మధుకర్‌రావు, డిమాండ్ చేశారు. మంగళవారం స్పెషల్ టీచర్స్ నోషనల్ ఇంక్రిమెంట్స్ సాధన కోసం ఛలో హైదరాబాద్ మౌన దీక్షకు సిరిసిల్ల పట్టణం నుంచి పెన్షనర్లు, 398 స్పెషల్ టీచర్ల రాజన్న సిరిసిల్ల జిల్లా జేఏసీ అధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మధుకర్‌రావు మాట్లాడుతూ స్పెషల్ టీచర్లకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్ ఇస్తూ పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు నాయకులు ఏ రాజేశ్వర్‌రావు, పీ రాజేశ్వర్‌రావు, ఎస్ రాజేశ్వర్‌రావు, సిహెచ్ జనార్దన్, ఎండీ రియాజుద్దీన్, కే రమేష్, రాధకిషన్, రామచంద్రం, భూంరావు, వెంకటరమణరెడ్డి, దేవరాజం, సత్తయ్య, అంజయ్య, హనుమంతరెడ్డి, రాజన్న, ఆనందరెడ్డిర విశ్వజ్ఞాచారి, శంకర్ నారాయణ ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుపై విచారణ

కోనరావుపేట జూలై 20: మండలంలోని నిజామాబాద్ గ్రామంలో మంగళవారం ఎస్సీ ఎస్టీ యాక్ట్‌పై అడిషనల్ ఎస్పీ శేషాద్రి రెడ్డి విచారణ చేపట్టారు అనంతరం కోనరావుపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు ఈ సందర్భంగా మేర పరిశోధన క్వాలిటీపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు.

వృద్ధురాలిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

బోయినపల్లి, జూలై 30: మండలంలోని వెంకట్రావుపల్లిలో వృద్ధురాలని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గ్రామానికి చెందిన అంగన్వాడి ఆయమ్మ స్వరూప సాయంత్రం పూట పిల్లలను ఇళ్ళకు పంపి వస్తుండగా, కరీంనగర్ నుంచి బైక్‌పై అతివేగంగా వచ్చి, వృద్ధురాలిని ఢీకొన్నారు. ప్రమాదంలో స్వరూపకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

సాగు చేసుకుంటున్న భూమిని ఇప్పించండి

కోనరావుపేట, జూలై 30: మేము సాగు చేసుకుంటున్న భూమిని మాకు ఇప్పించి న్యాయం చేయండి సార్ అంటూ బావుసాయిపేట మాదిగ కులస్తులు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులును కోరారు. ఈ సందర్భంగా బావుసాయిపేట మాదిగ కులస్తులు కోనరావుపేట బస్టాండ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం మాకు దొరగారు ఎకరం 30 గుంటల భూమిని ఇచ్చారని అప్పటి నుంచి మేము సాగు చేసుకుంటున్నామని అన్నారు. ఈ మధ్య తిక్కల పోచయ్య అనే వ్యక్తి భూమిని కొనుగోలు చేశానని అందులోకి వచ్చి భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని అన్నారు. మాకు న్యాయం చేయాలని ఎస్ఐ అంజనేయులును కోరుతున్నామని తెలిపారు. మారుపాక శంకర్, బొద్దు రాములు, నరసయ్య, నేరెళ్ల బుచ్చయ్య, నరసయ్య, మేకల దేవయ్య, వెంకటి తదితరులు ఉన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

చందుర్తి, జూలై 30 : పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి గ్రామంలో అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పౌరహక్కులపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాపు, ఆర్ఐ శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్, నాయకులు కటకం మల్లేశం, లింగంపల్లి బాబు,అంబల్ల శ్రీకాంత్, అంబేద్కర్ సంఘం నాయకులు, ఖ్రామస్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, జులై 30: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో చర్చించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు సోయినేని కరుణాకర్, రొండి రాజు, ప్రవీణ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.



భూమిపై పచ్చదనం.. నింగిలో రంగుల వర్ణం

ఓ వైపు ఆకాశంలో వెల్లివిరిసిన ఇంద్రధనుస్సు, మరోవైపు భూమిపై పరచుకున్న పచ్చదనం ముస్తాబాద్ ప్రజలను మంగళవారం సాయంత్రం కనువిందు చేసింది. ఈ ఫొటో మండల కేంద్రానికి చెందిన శ్యాగ మహేశ్ అనే యువరైతు తన కెమెరాలో పొలం వద్ద బంధించాడు. - ముస్తాబాద్

రెండో విడత రుణమాఫీపై సంబరాలు


ఎల్లారెడ్డిపేటలో సంబరాలను నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

ఎల్లారెడ్డిపేట, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు, రైతులు సంబరాలు నిర్వహించారు. రాచర్లబొప్పాపూర్‌లో రైతు రుణమాఫీకి సంబంధించిన సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీక్షించారు. అనంతరం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి రైతు ప్రభుత్వమని స్పష్టం చేసిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, గౌస్, సాహెబ్, రాంరెడ్డి, నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, రవి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

● **ఇల్లంతకుంట:** రైతుల రుణమాఫీని పురస్కరించుకొని రైతువేదికలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో రైతులు పాల్గొని సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించి మంగళవారం రోజున రూ 1.50 లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించింది.

అందులో భాగంగా ఇల్లంతకుంట, రేపాక, గాలిపెల్లి, పొత్తూర్, వల్లంపట్ల, పెద్దలింగాపూర్, దాచారం గ్రామాలలోని రైతువేదికలలో సమావేశాలు జరుగగా వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


కోనారావుపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

కోనరావుపేట, జూలై 30: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. గామపంచాయతీ ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ నిరసన కార్యక్రమానికి వెళుతున్న ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు కార్మికుల పక్షాన నిలబడతానన్న కాంగ్రెస్ ప్రభుత్వం నేడు కార్మికులను పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఆయన వెంట గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు వెంకటేష్, ఆశ వర్కర్ జమున, వరలక్ష్మి ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: ఆశా వర్కర్లతోపాటు గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలంటూ సీఐటీయూ అధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్‌కు వెళ్లుతున్న అశవర్కర్లతోపాటు గ్రామపంచాయితీ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకులు మంగళవారం తెల్లవారుజున పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల పాతబస్టాండ్ నుంచి 21 మంది అశావర్కర్లు ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వెళ్లుతుండగా సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అధ్వర్యంలో మానేరు వంతెన దగ్గర బస్సును నిలిపివేసి ఆశావర్కరులను సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే తంగళ్లపల్లి, నేరేళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో పనిచేసే అశావర్కర్లను సైతం పోలీసులు ముందస్తు అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ముఖ్యనాయకులు సైతం హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, అశావర్కర్ తమ్మెట లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఆశాకార్యకర్తలను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ సొల్లు శాంత మాట్లాడుతూ అక్రమ అరెస్టుల ద్వారా ఉద్యమాన్ని అణిచివేయలేరన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం మొండివైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. కరోనా సమయంలో రావలసిన పెండింగ్ బిల్లులు ఇంతవరకు రాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గొర్రె లక్ష్మి, కాంపెల్లి మంజుల, న్యాత లక్ష్మి, కుర్మ రేణుక, దాసరి అనంతలక్ష్మి తదితరులు ఉన్నారు.

● **సమస్యలపై పోరాడితే అరెస్టులు సరికాదు**

వీర్నపల్లి: సమస్యలపై పోరాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులను ధర్నాకు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం సరికాదని కారోబార్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ మండిపడ్డారు. వీర్నపల్లి మండలం నుంచి హైదరాబాదులో నిర్వహించే ధర్నాకు వెళ్తున్న కారోబార్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌తో పాటు మండల గౌరవ అధ్యక్షుడు న్యాత నర్సయ్య, మండల అధ్యక్షుడు లద్దూరి నర్సయ్యను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు జీతాలు రాక కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.


సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో ఆశావర్కర్లు

చందుర్తి: సీఐటీయూ పిలుపుమేరకు చలో హైదరాబాద్‌కు వెళ్తున్న గ్రామపంచాయతీ కార్మికులను, ఆశా కార్యకర్తలను మంగళవారం ఉదయం ముందస్తుగా చందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండలం లోని పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి


కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన జేఏసీ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 30: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభంతోపాటు సమస్యలను పరిష్కరించి విద్యుత్ సబ్సిడీలను కొనసాగించడంతోపాటు ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలంటూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల అధ్వర్యంలో వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించడంతోపాటు ఆసాములు, మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వ ఆర్డర్లను అందించి ఉపాధిని కల్పించాలంటూ సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట మంగళవారం యాజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి సమస్యలను విన్నవించి, వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమల సమస్యలతోపాటు విద్యుత్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం కోసం ప్రయత్నాలు చేస్తామన్నారు ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే అధారపడవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వం అధారపడే వస్త్ర పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వం కొనసాగించిన పథకాలను బంద్ చేసి కార్మికులకు ఉపాధిని దెబ్బతీయం ఎంతవరకు సమంజమన్నారు. సమస్యలను పరిష్కారించకుండా కార్మికులకు ఉపాధిని కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపుకు నేతన్నలను బలిచేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి 30 వేల కుటుంబాల జీవితాలను అగం చేయకుండా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కారించి ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి, అసాములసమన్వయ కమిటి అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, నాయకులు అడెపు రవీందర్, చేరాల అశోక్, మోర రాజు, గాజుల నారాయణ, ఉడుత రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, జూలై 30: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి మంగళవారం పరామర్శించారు. దాచారం గ్రామానికి చెందిన బంటు కనుకయ్య, బర్ల చంద్రయ్య, తిప్పాపూర్ గ్రామానికి చెందిన దమ్మని బాబులు అనారోగ్యాలతో మృతిచెందగా కుటుంబీకులను కలిసి బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతి, రమేష్చ కిషన్, శ్రీశైలం, శ్రీనివాస్, మహేందర్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని మర్రిపల్లిలో ప్రమాదవశాత్తు వ్యసాయ బావిలోపడి మృతి చెందిన తుపాకుల పర్శరాములు కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఏశ తిరుపతి, సుమన్, పిట్టల వెంకటేశం, సతీష్‌రెడ్డి, లచ్చయ్య, రాజు, ప్రణీత్, లింగయ్యసంతోష్, సాయి, వెంకటేష్, నరేష్, పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వీర్నపల్లి, జూలై 30: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు తప్పవని ఎస్ఐ ఎల్లాగౌడ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం రాశిగుట్ట తండాలో అటవీభూమిలో ప్లాంటేషన్ మొక్కలను ధ్వంసం చేసి అటవీశాఖ అధికారులపై తిరగబడిన 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పోడు భూములను సాగు చేసుకునే గిరిజనులు చట్ట ప్రకారం నడుచుకోవాలన్నారు. చట్టాన్ని వ్యతిరేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

రుద్రంగి, జూలై 30: రుద్రంగి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో రుద్రంగిలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం 25 మందికి కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. వారికి కరీంనగర్‌లో గల రేకుర్తి కంటి ఆసుపత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో ఉచిత కంటి ఆపరేషన్ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రుద్రంగి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోడికర్ హిరోజి, డా. ప్రభాకర్, క్లబ్ సభ్యులు జిల్లా బాధ్యులు తీపిరెడ్డి వెంకటొరెడ్డి, కార్యదర్శి బండి యాదగిరి, ఫాస్ట్ ప్రెసిడెంట్ మంచె రమేష్, ఎర్రం గంగ నర్సయ్యకోటగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవి మాత ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డిపేట, జూలై 30: మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలోని మహిళలు స్థానిక వాసవీ మాత ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని అచ్చయ్యస్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో మంగళవారం కన్యక పరమేశ్వరీ వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత అన్నిరకాల కూరగాయాలతో శాకంబరీగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్థానిక వాసవీ మహిళ విభాగం అధ్యక్షురాలు చీకోటి శకుంతల, అధ్యక్షుడు బచ్చు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు అంజనేయులు, ఉప్పల కృష్ణమూర్తి, కార్యదర్శి మందుల రవి, వాసవి మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న డిపో మేనేజర్

సిరిసిల్ల టౌన్, జూలై 30: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని టీఎస్ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత అన్నారు. ప్రమాదరహిత వారోత్స వాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణం ఆర్టీసీ డిపో ఆవరణలో టీఎస్ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే మానవాళికే ప్రమాదం అన్నారు. ప్రతీ ఒక్కరు ఒక్కో మొక్క నాటి ఆ మొక్కను సంరక్షించాలన్నారు. అనంతరం డిపోలో ఎంవీఐ వంశీధర్ ప్రమాదరహిత వారోత్సవాలను ప్రారంభించారు. ప్రమాదరహిత డ్రైవర్లు గణపతి, మోహన్, బాలరాజులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపో సిబ్బంది, కార్మికులకు ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలలో విజేతలకు డిపో మేనేజర్ ఏ ప్రకాష్‌రావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, టీ2, టీ3 రాజమౌళి, రామకృష్ణ, డిపో హెడ్‌గార్డ్ రవీందర్, సేఫ్టీ వార్డెన్ రాంరెడ్డి, వెల్ఫేర్ కమిటీ మెంబర్స్ నర్సింహులు, మల్లేష్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: ఆర్టీసీ బస్సులపై నమ్మకంతో ప్రయాణికులు వస్తారని, ఆర్టీసీ డ్రైవర్లు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చాలని టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రమాదరహిత వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి సీఐ వీరప్రసాద్, ఎంవీఐ వంశీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అక్సిడెంట్ లేకుండా డ్రైవింగ్ చేసిన వెంకటస్వామి, మురళీధర్, జీఆర్‌రెడ్డి అనే డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రం, సత్యనారాయణ, వెంకటయ్య, పీఆర్వో శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

బీసీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 30: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను విస్మరించిందని, వెంటనే బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సిరిసిల్ల కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి నాయకులు తరలివచ్చి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం 9,200 కోట్లు మాత్రమే కేటాయించి రాష్ట్రంలో 50 శాతంపైగా బీసీలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు గుండెల్లి వేణుగోపాల్, రాజం ప్రకాష్‌యాదవ్, వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పౌష్టికాహారంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచాలి

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ - దుమాల ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ


విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, జూలై 30: జిల్లాలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగది గదులు, వంట గది, భోజనశాల, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమగ్ర అభివృద్ధికి అధ్యాపకులు, సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యవంతులుగా ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్‌ను సూచించారు. అల్పాహారంలో పులిహోర అందించడం వల్ల తినడం ఇబ్బందిగా మారుతోందని విద్యార్థులు అడిషనల్ కలెక్టర్‌తో వాపోయారు. దాంతో స్పందించిన అడిషనల్ కలెక్టర్ విద్యార్థులకు ఇడ్లీ అందించాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఖీమ్యానాయక్ హెచ్చరించారు. ఆర్డీవో రమేశ్, తహసీల్దార్ రామచంద్రం, పాఠశాల ప్రిన్సిపాల్ మంజీద్, తదితరులు ఉన్నారు.